## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- మారుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా దేశ యువతకు నైపుణ్యాలు, అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

- పర్యావరణ రక్షణకు ఎలాంటి చట్టాలు లేని కాలం నుంచే ప్రకృతిని రక్షించే సంస్కృతి భారత్‌లో ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

- ప్రపంచంలోని మొత్తం సెమీకండక్టర్ డిజైన్ నిపుణుల్లో భారత్ నుంచి 20 శాతం మంది సేవలందిస్తున్నారని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు.

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళం, తమిళనాడు రాష్ట్రాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

================================

మారుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా దేశ యువతకు ఆధునిక నైపుణ్యాలు, భవిష్యత్ అవకాశాలు కల్పించడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థల్లో నియమితులైన యువతకు 51 వేలకుపైగా నియామక పత్రాలను ప్రధానమంత్రి ఈరోజు దృశ్య మాధ్యమ విధానంలో అందజేశారు. 20వ `రోజ్‌గార్ మేళా`ను పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ... లక్ష కోట్ల రూపాయల వ్యయంతో `ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన`ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా సుమారు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి అడుగుపెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గడిచిన కొన్నేళ్లలో భారత్ దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTA) కుదుర్చుకుందని, ఇది దేశీయ పారిశ్రామికవేత్తలకు కొత్త మార్కెట్లను, యువతకు అంతర్జాతీయ కెరీర్ అవకాశాలను తెరిచిందని నరేంద్ర మోదీ అన్నారు. భారత్‌కు చెందిన యువత నైపుణ్యంపై ప్రపంచవ్యాప్తంగా నమ్మకం పెరిగిందని, మన నిపుణులు, స్టార్టప్‌ల నుంచి ప్రపంచం ఎంతో

ఆశిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద `స్టార్టప్ ఈకోసిస్టమ్`గా భారత్ నిలిచిందని ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు.

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్ తలసరి కర్బన్ ఉద్గారాల వాటా సగం కంటే తక్కువేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కర్బన్ ఉద్గారాల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలపై తరచూ నెపం మోపడం సరికాదని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆధ్వర్యంలో ఈరోజు "ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. పారిస్ COP-21 సదస్సులో చేసుకున్న ఒప్పంద లక్ష్యాలను గడువు కంటే ముందే పూర్తి చేసిన ఏకైక జీ-20 దేశం భారత్ మాత్రమేనని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతీ రంగంలోనూ భారత్ ఎంతో పురోగతి సాధించిందన్నారు. దేశంలో పునరుత్పాదక ఇంధన రంగానికి ప్రాధాన్యమిస్తున్నామని, గడిచిన 12 ఏళ్లలో పవన విద్యుత్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిందని చెప్పారు. క్లీన్ మొబిలిటీ, గ్రీన్ హైడ్రోజన్, అణు విద్యుత్ ఉత్పత్తిపైనా దృష్టి సారించామన్నారు.
ఇదే సమావేశంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణకు సంబంధించి ఎలాంటి చట్టాలు, ట్రిబ్యునళ్లు లేని కాలం నుంచే ప్రకృతిని రక్షించే సంస్కృతి భారత్‌లో ఉందని చెప్పారు. అడవులు, నదులు, సరస్సులు, వన్యప్రాణులను కాపాడుకోవడం, సమస్త జీవుల పట్ల దయ కలిగి ఉండటం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొంటూ…

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోని మొత్తం సెమీకండక్టర్ డిజైన్ నిపుణుల్లో భారత్ తరఫున ప్రస్తుతం దాదాపు 20 శాతం మంది సేవలందిస్తున్నారని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. దేశంలో డిజైన్ ప్రతిభకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగా సుమారు 85 వేల మంది డిజైన్ ఇంజనీర్లకు శిక్షణనిచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. న్యూ ఢిల్లీలో జరుగుతున్న `సెమీకాన్ ఇండియా 2026` సదస్సు వేదికగా ఆయన విలేకరులతో ఈరోజు మాట్లాడారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులను మరింత వేగవంతం చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, ఇన్వెస్టర్లతో ప్రభుత్వం కలిసి పని చేస్తుందని, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని ఆయన భరోసానిచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని పలు హైకోర్టులకు 14 మంది న్యాయాధికారులను న్యాయమూర్తులుగా, అదనపు న్యాయమూర్తులుగా నియమించారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించిన అనంతరం ఈ నియామకాలు ఖరారు చేసినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నివేదిత అనిల్ శర్మ, నిషా సహాయ్ సక్సేనా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టుకు ఐదుగురు అదనపు న్యాయమూర్తులు, జమ్మూ-కాశ్మీర్, లడఖ్ హైకోర్టుకు ఒకరు నియమితులయ్యారు. మనోజ్ ప్రసాద్, అఖిల్ కుమార్, రామ్ శర్మ జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. కర్ణాటక హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గృహ వినియోగ ఎల్పీజీ (LPG) సిలిండర్లపై రాయితీ పొందేందుకు బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ నిబంధన వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. అర్హులైన నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడటం, నిబంధనలకు విరుద్ధంగా గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు తరలించకుండా నిరోధించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యమని ఆ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుర్వేదంతో పాటు ఇతర ఆయుష్ వైద్య విధానాల్లో కృత్రిమ మేధ (AI) వినియోగాన్ని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ వేగవంతం చేస్తోంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న `ఆయుష్ గ్రిడ్` డిజిటల్ వేదిక ఆధారంగా ఆరోగ్య సంరక్షణ, పరిశోధనలు, విద్య, సమాచార సేవలు వంటి పలు రంగాల్లో ఏఐ సాంకేతికతను విస్తృతంగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా పౌరులు, పరిశోధకులు, విద్యార్థులు కోసం ప్రత్యేక ఏఐ చాట్‌బాట్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. `యోగ సారథి` యోగా సూచనల కోసం AI చాట్‌బాట్‌గా, `నివేశ్ సారథి` ఆయుష్ రంగంలో పెట్టుబడుల కోసం AI అసిస్టెంట్‌గా పని చేస్తున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని సవల్యాపురం - గుంటూరు మార్గంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను ఆధునీకరించేందుకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. 146 ట్రాక్ కిలోమీటర్ల మేర ఉన్న ఈ సెక్షన్‌లో ఓవర్ హెడ్ విద్యుత్ లైన్ల బలోపేతానికి 142 కోట్ల రూపాయలకు పైగా నిధులను మంజూరు చేసినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలాగే ఈశాన్య రైల్వే పరిధిలోని లఖ్‌నవూ డివిజన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన `కవచ్ వెర్షన్ 4.0` (Kavach 4.0) వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం 250 కోట్ల రూపాయలకు పైగా నిధులను మంజూరు చేసినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్‌లోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో 20వ ఆసియా క్రీడలు ఈరోజు అధికారికంగా ప్రారంభమయ్యాయి. జపాన్ చక్రవర్తి నరుహితో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించారు. క్రీడాకారుల కవాతులో 501 మంది సభ్యులతో కూడిన భారత బృందానికి మను బాకర్, పవన్ సెహ్రావత్ నాయకత్వం వహించారు. అధికారిక ప్రారంభోత్సవానికి ముందే కొన్ని క్రీడాంశాలు ప్రారంభమయ్యాయి. మహిళల క్రికెట్‌లో నిన్న జపాన్‌పై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన భారత జట్టు ఇప్పటికే సెమీఫైనల్స్‌కు చేరుకుంది. నిషిన్ వేదికగా రేపు జరిగే రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన `టెక్ బాల్` మహిళల సింగిల్స్ లో భారత్‌కు చెందిన క్వీన్సీ డిసౌజ రేపు కాంస్య పతకం కోసం జపాన్‌కు చెందిన యుయినా సకామోటోతో తలపడనుంది. ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న భారత క్రీడా బృందానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ ద్వారా ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత అథ్లెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, విజయాలు సాధించి దేశానికి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు అండమాన్ అండ్ నికోబార్ దీవులు, కర్ణాటక, కేరళం, మాహే, మధ్య మహారాష్ట్ర, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. మరోవైపు మరాఠ్వాడా, తూర్పు రాజస్థాన్, జార్ఖండ్, కొంకణ్, గోవా, ఒడిశా సహా ఈశాన్య భారతంలోని పలు ప్రాంతాల్లో రేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అండమాన్, నికోబార్ దీవుల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది.

================================

================================